క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సకు 64 మంది ఎంపిక



వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు జాక్సన్

బాడంగి: స్థానిక శివాలయం దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత నేత్రవైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. బాడంగి, పిన్నవలస, పూడివలస, భీమవరం, డొంకినవలస తదితర ప్రాంతాల నుంచి 109 మంది కంటి రోగులు హాజరై, తమ కళ్ల ఆరోగ్యాన్ని పరీక్షించుకున్నారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 64 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ వెంకటరమణ తెలిపారు. వీరందరినీ బస్సులో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించామన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



పణుకువలసలో కాలువల్లోని పూడికలు తీస్తున్న కూలీలు

తెర్లాం: మండలంలోని పణుకువలస, సోమిదలవలస గ్రామాల్లో సర్పంచ్ చందక సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. వర్షాకాలం కావడంతో నీరు నిల్వ ఉండిపోకుండా కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికలు తొలగించారు. గ్రామస్తులు కూడా పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని, అనవసరంగా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని కోరారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటిస్తేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని గుర్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధి గ్రా మాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ డీఈ పి.హరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుజ్జింగివలస, గోషాడ, తెట్టంగి, పోలాయవలస, చుక్కపేట, చోడ వరం ,పెనుబర్తి, చింతపల్లిపేట, గంగిరెడ్లపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శివాలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు మేడపాటి కిశోర్‌శర్మ ప్రత్యేక పూజలు, హోమం, మండపారాధన చేశారు. సోమవారం అభిషేకాలు, అష్టోత్తరశతనామ పూజలు, శివపార్వతుల కల్యాణం జరిపించను న్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సదుపాయం కల్పించండి

సీతంపేట: తాగునీటి సదుపాయం కల్పించాలని మండలంలోని రామన్నగూడ, మద్యగూడ తదితర గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. గతకొన్ని రోజులుగా ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నా సక్రమంగా అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి, తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం అమ్మవారిని భక్తుల దర్శనార్థం అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో దాతల సహకారంతో అమ్మవారి దేవస్థానంలో భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

రోడ్డెక్కిన ప్రజానీకం

సాలూరు: ఈదురుగాలులకు రోడ్లపై చెట్లు పడి రోజులు దాటుతున్నా వాటిని తీయకపోవడం, విద్యుత్ పునరుద్ధరణ చేయకపోవడంతో దండిగాం రోడ్డు పరిసరాల్లో ప్రజానీకం రోడ్డుపై ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ నెల 14న కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో దండిగాం రోడ్డు సమీపంలో చెట్టు రోడ్డుపై అడ్డుగా పడిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు , విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కాగా రోడ్డుకు ఓ వైపు చెట్టు కొమ్మను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. నాటి నుంచి నేటి వరకు అలానే రోడ్డుకు ఓ పక్క గుండానే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి కానీ చెట్టును తొలగించలేదు. అంతేకాకుండా నాటి నుంచి నేటి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోజులు దాటుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదివారం వారు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి, రోడ్డుపై మిగిలిన చెట్టును తొలగించడం, విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. అలాగే గాంధీపార్కులో నేలకొరిగిన చెట్లను నేటికీ అధికారులు తొలగించలేదని స్థానికులు చెబుతున్నారు.



దండిగాం రోడ్డు వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు



గాంధీపార్క్ వద్ద పడిపోయిన చెట్లు

ఆదివాసీ ఉద్యోగాలకు నూతన చట్టం చేయాలి

పార్వతీపురంటౌన్: జీవో నంబర్ 3 స్థానంలో ఆదివాసీ ఉద్యోగ నియామకాలకు నూతన చట్టాన్ని ఏర్పాటు చేయాలని తాళ్లబురిడి సర్పంచ్ రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం గిరిజన భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ షెడ్యూల్ ప్రాంతంలో రుద్దయిన జీవో నంబర్ 3 స్థానంలో ఆదివాసీ ఉద్యోగ నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం నూతన చట్టాన్ని ఏర్పాటు చేసి ఆదివాసీ ప్రాంతంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో స్పెషల్ డీఎస్సీని ప్రకటించాలని కోరారు. ప్రస్తుతం ప్రకటించిన 16,349 ఖాళీలతో పాటు 5వ షెడ్యూల్ నిబంధనలకు అనుకూలంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి బ్యాక్‌లాగ్ పోస్టులు కూడా ప్రకటించాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

పాలకొండ: ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమైన నేపథ్యంలో సాగునీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంఘం నాయకుడు బి.అప్పలనాయుడు ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. జూన్ నెల పూర్తికావస్తోందని, నాగావళి ఎడమకాలువ ద్వారా సాగునీరు విడుదల చేయాలని, చెరువుల్లో నీరు నింపాలన్నారు. ఇప్పటికే రైతులు పొలాల్లో వెదలు వేశారని, చెరువుల్లో నీరు ఉంటే రైతాంగానికి సాగునీటి ఇబ్బంది ఉండదన్నారు. ప్రస్తుతం నీరు విడుదల చేస్తే శివారు ప్రాంతాలకు ఆ నీరు చేరేసరికి దాదాపు 15 రోజుల వరకు పట్టవచ్చన్నారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ అధికారులు చొరవ తీసుకుని, అన్నదాతకు మేలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

వరివెద సాగు



నీలకంఠాపురంలో వరి వెద దుక్కులు చేస్తున్న రైతులు

సీతానగరం: మండలంలో మూడు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా మట్టినమూనాలు చేసి ఉంచిన పొలాల్లో వరివెదల రూపంలో రైతులు వరి సాగు చేస్తున్నారని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన నీలకంఠాపురం, వెంకటాపురం, బూర్జ, నిడగల్లు గ్రామాల్లో వరివెదల రూపంలో చేస్తున్న సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటివనరులున్న గ్రామాల రైతులు ఇప్పటికే మట్టి నమూనాలు చేయడానికి దుక్కి చేసి కలుపు నివారణ మందును పిచికారీ చేస్తున్నారన్నారు. కలుపు లేని వరిపంట పండించాలన్న సంకల్పంతో వెదలు వేసినప్పటి నుంచే జాగ్రత్తలు పాటించాల్సి ఉందని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులే భవిష్యత్‌లో వారికి అవసరమైన విత్తనాలు స్వయానా తయారు చేసుకోవడంలో అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఖరీఫ్‌సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో నవధాన్యాల సాగుపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు నవధాన్యాల సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రధాన పంట సాగుకు ముందు పొలాల్లో నవధాన్యాలు చల్లుకోవాలని, అవి మొక్కలైన తర్వాత అదే నేలలో కలియదున్నితే ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు నేల నుంచే లభిస్తాయన్నారు. దీంతో ఆరోగ్యవంతమైన పంట అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో నవధాన్యాల సాగు-వాటి ప్రయోజనాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రధాన పంట విత్తనాలు వేసుకునే ముందే నేలలో నవధాన్యాలు చల్లుకుని, మొక్కలైన తర్వాత కలియదున్నాలన్నారు. తద్వారా నేల సారవంతమై ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు నేల ద్వారా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ పి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఏసు ప్రేమాలయంలో ఫాదర్స్‌డే వేడుకలు

విజయనగరం టౌన్: సృష్టి కర్త అయిన దేవుడే ఈ భూమిపై ఉన్న సకల జీవులకు తండ్రి అని డాక్టర్ పాల్ డగ్లస్ అన్నారు. పట్టణంలోని ఏసు ప్రేమాలయంలో ఫాదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పాస్టర్ అలజంగి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలువురు ఫాదర్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్ రవికుమార్, విక్టర్ బాబు, వినిస్టన్, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, చౌదరి, ఏసుపాదం, అరుణ్‌కుమార్ ఐజాక్ పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో డివిజన్ స్థాయి తాళం భజన పోటీలు

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో సాయిరాం భజన మండలి సమాజం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు డివిజన్ స్థాయిలో నిర్వహించనున్న తాళం భజన పోటీల్లో భజన మండలి కళాకారులు పాల్గొనాలని నిర్వాహకుడు సీహెచ్ వెంకటరమణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ జూన్ 17,18,19 తేదీల్లో పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు బొబ్బిలి, సీతానగరం, బలిజిపేట, సాలూరు, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం మండలాలకు చెందిన భజన బృందాలై ఉండాలని, మధ్యాహ్నం 1గంటకు హాజరుకావాలని కోరారు. పోటీలలో పాల్గొనదలచిన భజనమండలి గ్రూప్ చిరునామా, ప్రవేశరుసుం రూ. 300లు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని,

ఎంపికైన బృందాలకు బహుమతుల ప్రదానం, సత్కారం ఉంటుందని తెలిపారు. భోజన వసతి కల్పించనున్నామని, ఇతర వివరాల కోసం ఫోన్ నంబర్ల 9502833436 లేదా 9490460976ను సంప్రదించాలని సూచించారు.

ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్‌కు చేస్తున్న మరమ్మతులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీ దేవాంగుల వీధి, కర్రోతువీధికి తాగునీరు సరఫరా అవుతున్న ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుల బారిన పడడంతో తాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఫిర్యాదులు చేసిన మేరకు మరమ్మతులు చేసినట్లు ఏఈ పవన్‌కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ జె.తేరేజమ్మ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి వెంకటరావు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారన్నారు. సోమవారం యథావిధిగా తాగునీరు ఇంటింటి కుళాయిల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జె.వెంకటరావు, గ్రామ పెద్ద గరికయ్య పాల్గొన్నారు.

జ్వర పీడితులకు గ్రామంలోనే వైద్యసేవలు

సీతానగరం: వర్షాలు కురవడం వల్ల ప్రజలు జ్వరాల బారిన పడే ఆస్కారం ఉన్నందున వైద్యసిబ్బంది స్థానికంగానే మెరుగైన వైద్య సేవలందించాలని పీహెచ్‌సీ డాక్టర్ బి.పావని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె పీహెచ్‌సీలో మాట్లాడుతూ మూడు రోజుల నుంచి అరకొరగా వర్షాలు కురవడం వల్ల పొలం పనులకు వెళ్తున్న వారు తడిసిపోయి జ్వరాల బారిన పడుతున్నారన్నారు. వాతావరణం చల్లగా ఉన్న సమయంలో జీర్ణం కాని ఆహార పదార్థాలు తిని అజీర్ణానికి గురై విరేచనాలకు గురవుతారన్నారు. వైద్యశాఖ సూపర్‌వైజర్ల పర్యవేక్షణ లో గ్రామాల్లో వైద్య సిబ్బంది పరిశీలించి ఇంటింటి సర్వే నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించడానికి సూచనలు జారీ చేశామన్నారు. ఇప్పటికే వెల్‌నెస్ కేంద్రాల్లో వివిధ రకాల వ్యాధులను గుర్తించడానికి అవసరమైన పరికరాలున్నాయని, వ్యాధి తగ్గుముఖం పట్టడానికి అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల్లో వ్యాధుల బారిన పడుతున్న వారంతా వినియోగించుకోవాలని కోరారు. స్థానికంగా వ్యాధి నయంకాని వారిని పీహెచ్‌సీకి తరలించేవిధంగా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెప్పారు.

అలవాటు 'బడి'తే చాలు..

- పునఃప్రారంభమైన పాఠశాలలు
- విద్యార్థులను సన్నద్ధం చేయడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



పాఠశాలకు వెళ్తున్న చిన్నారులు (ఫైల్)

విజయనగరం: వేసవి సెలవులు ముగిశాయి.. బడి గంటలు మోగాయి.. పుస్తకాలు, చదువులతో కుస్తీ పట్టిన పిల్లలంతా సెలవులు రాగానే అమ్మమ్మ, తాతయ్య, బంధువులతో కలిసి ఇప్పటివరకు కాలక్షేపం చేశారు. బడి తలుపులు తెరవడంతో ఇక బడిబాట పడుతున్నారు. సుమారుగా నెలన్నర రోజులు స్నేహితులు, బంధువులు, సెల్‌ఫోన్‌లు, ఆటపాటలతో హాయిగా.. ఎలాంటి ఒత్తిడి లేకుండా గడిపిన పిల్లలు ఇప్పుడన్నీ వదిలి ఒక్కసారిగా బడికి వెళ్లాలంటే కొంత ఇబ్బందే. ప్రాథమిక స్థాయి పిల్లలకైతే ఎంతో బద్ధకంగా ఉంటుంది. ఈ తరుణంలో వీరిని తిరిగి బడికి సన్నద్ధం చేస్తూ.. గాడిన పెట్టాలంటే తల్లిదండ్రులకు తలకు మించిన భారమే. కానీ కొంత ఓర్పు, శ్రద్ధతో వారిలో మెల్లమెల్లగా మార్పు తీసుకొస్తూ సన్నద్ధం చేస్తేనే చదువుకునే అవకాశముంది.

సరదాగా గడపాలి..

పాఠశాలకు అలవాటయ్యే వరకు ఉపాధ్యాయులు పిల్లలతో సరదాగా గడపాలి. పాటలు పాడించడం, పదాలతో ఆటలు, పద్యాలు, గణితంలో సరదాగా చతుర్విధ ప్రక్రియలు నేర్పుతూ వారికి ఇష్టం పెరిగేలా చూడాలి. ఇతర విద్యార్థులతో పోల్చకుండా చిన్న జవాబు చెప్పినా మెచ్చుకోవాలి. వీరిలో ఉన్న ప్రతిభను గుర్తించి అందుకు సంబంధించిన విషయాలు చెబితే ఉత్సాహంగా ఉంటారు. కొద్ది రోజుల పాటు హోమ్ వర్కు లేకుండా చూడాలి. ప్రారంభం నుంచే హోమ్‌వర్కు ఇస్తే భారంగా అనిపిస్తుంది.

తల్లిదండ్రుల పాత్రే కీలకం

వేసవి సెలవులు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఆటపాటలతో సందడిగా గడిపిన చిన్నారులు తిరిగి బడిబాట పట్టే విషయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. బడి ఉన్న సమయంలో ఉదయం నిద్రలేచి త్వరగా తయారయ్యేవారు. కానీ సెలవుల్లో అలా కాదు.. ఎప్పుడో రాత్రికి కాని నిద్రించకపోవడం.. ఉదయం ఆలస్యంగా నిద్ర లేవడం.. సమయానికి భోజనం చేయకపోవడం వంటివి జరిగాయి.. ప్రస్తుతం చిన్నారులను వేకువజామునే గట్టిగా అరుస్తూ లేపకుండా మెల్లగా లేపుతూ వారిలో మార్పు తీసుకురావాలి. కొత్త పుస్తకాలు, కొత్త బ్యాగులు, బూట్లు, ఇతర సామగ్రి కోసం పిల్లలతో కలిసి షాపింగ్ చేస్తే ఉత్సాహంతో బడికి పోవడానికి ఇష్టపడతారు. బడి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత హోంవర్కు కొద్ది రోజుల పాటు తల్లిదండ్రులే దగ్గరుండి చేయిస్తే విద్యార్థులకు కొంత వెసులుబాటుగా ఉంటుంది. ఆ తర్వాత వారే సొంతంగా చేసుకుంటారు.

ఇంటిలో నేర్చుకునేలా..

ఇప్పుడే కొత్తగా బడికి వెళ్లే పిల్లలది మరో సమస్య. మూడేళ్లు నిండితే చాలు పాఠశాలకు పంపిస్తున్నారు. ఇప్పటి వరకు అమ్మానాన్న, కుటుంబ సభ్యులతో గడిపిన పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే మారాం చేస్తారు. వారిలో పాఠశాలలకు వెళ్లాలనే ఉత్సాహం నింపాలి. అందమైన బొమ్మలతో కూడిన సంచులు, ఆట వస్తువులు ఇవ్వడంతో పాటు ఇంటి వద్దనే అక్షరాలు, చిన్న చిన్న పదాలు నేర్పిస్తే హుషారుగా ఉంటారు. వీటితో పాటు రైమ్స్, కథలు, బొమ్మలు చూపిస్తూ పదాలు చెప్పించాలి. ఒకటో తరగతి, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు ఉపయోగకరంగా ఉండే చార్టులు పిల్లల ఎత్తుకు సరిపడేలా ఇంటిలో గోడలకు అతికించాలి.

ఉత్సాహం నింపాలి..

నెలన్నర రోజుల వరకు పుస్తకాలు, చదువు ఏవీ లేకుండా పిల్లలు హాయిగా గడిపారు. ఒక్కసారిగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే చోట.. ఒకే గదిలో కూర్చొని పాఠాలు వినాలంటే ఇబ్బందే. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల్లో ఎప్పటికప్పుడు ఉత్సాహం నింపాలి. తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు తగిన స్వేచ్ఛ కల్పిస్తూ ఆటపాటలతో సరదాగా బోధించాలి.

– కె.శ్రీనివాసరావు, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, విజయనగరం.

ప్రకృతి సాగు.. లాభాలు బాగు..



రాజాం: పాగిరిలో ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ పండిస్తున్న కూరగాయల పంట

వంగర: ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని, ప్రతీ రైతు ప్రకృతి సేద్యం వైపు పయనించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ ఆనందరావు అన్నారు. మండలంలోని కింజంగి, మరువాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు-వాటి ప్రయోజనాలపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ప్రధాన పంట వేసుకునేముందు నవధాన్యాలు పొలాల్లో చల్లుకుని, మొక్కలైన తర్వాత వాటిని అదే నేలలో కలియదున్నాలన్నారు. అలా చేయడం ద్వారా నేల సారవంతమై పంటలు బాగా పండుతాయన్నారు. విత్తనాలు వేసే ముందు వాటిని బీజామృతంతో శుద్ధి చేసుకోవాలని, అలా అయితే చీడపీడలు, తెగుళ్ల పంటకు సోకకుండా ఉంటాయన్నారు.

ప్రకృతి సాగు పద్ధతులు అవలంభిస్తూ వ్యవసాయం చేస్తే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అలాగే పంటకు పెట్టే పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏలు రేఖ, వరప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు, ఐసీఆర్‌టీ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తూ పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం పాగిరి యూనిట్ ఎల్‌వన్ పి.రమాదేవి తెలిపారు. మండలంలోని పాగిరి గ్రామంలో కూరగాయలు సాగుచేసే రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలపై ఆదివారం అవగాహన కల్పించారు. తక్కువ కమతాల్లో పంటలు పండించి, అధిక లాభాలు పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో జీరో బడ్జెట్ వ్యవసాయం సాధ్యమని, ఆవుపేడ, గత్తం, కషాయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. భూసారంపెరగడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు.



వంగర: రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ ఆనందరావు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్యారంబోర్డు ఆడుతున్న విద్యార్థులు

గరుగుబిల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని లైబ్రేరియన్ ఎస్.మధుసూదనరావు ఆకాంక్షించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వియ్ లవ్ రీడింగ్(చదవడమంటే మాకిష్టం) కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు ప్రముఖ సంఘ సంస్కర్త వావిలాల గోపాలకృష్ణయ్య జీవిత చరిత్రను వివరించారు. మంచి నడవడిక, ప్రవర్తన, క్రమశిక్షణ అలవడాలంటే ప్రముఖుల జీవిత చరిత్రలను చదివి స్ఫూర్తి పొందాలని లైబ్రేరియన్ సూచించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, క్యారంబోర్డు పోటీలు నిర్వహించారు. అలాగే పద్య పఠనం, పద్యాల కంఠస్తంపై అవగాహన కల్పించారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఇప్పుడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి మహాయజ్ఞం

కురుపాం: స్థానిక గాయత్రి శక్తిపీఠంలో ఐదు కుండీల గాయత్రి మహాయజ్ఞం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్న ప్రసాదం పంచిపెట్టారు.